# లక్ష్మీ హృదయము

శ్రీ అప్పలు, బి.ఏ.

"అంతగా నిద్ర పోవడం ఏమిటి? పెద్దవారి దగ్గర భయం ఏమాత్రమూ లేదు నీకు."

"లేదండి కూర్చొనే ఉన్నా" అని కారు డ్రయివరు జవాబిచ్చాడు.

"కూర్చొని కునకక పోతే కారయినా కాస్త శుభ్రం చేయలేకపోయావా?" అన్నది గురల లక్ష్మి.

"తొందరగా పోవచ్చన్నారని గుడ్డ ముక్కలయినా తేలేదండి" అంటూ క్రిందికి దిగిపోయాడు.

"ఏదో నెపం చెప్పడం మాత్రం బాగా ఎరుగుదువు. తుడాలనుంటే తలగుడ్డ చాలదూ. మక్కువలేని మనువు లాగుంది నీ వాలకం" అని అన్న లక్ష్మి పలుకులకి కొంచెం తొందరగా, "అలాగనే యింకొకరి దగ్గరకి పోతానంటే, 'తల్లిదండ్రుల్లేరని చిన్నప్పటినుండి యిక్కడ ఉండి, యిప్పుడు రెక్కలొచ్చాయని పోతానంటావురా', అని నాన్నగారు తిడతారు. నాకు వెనక్కి నూయి, ముందుకు గోయి లాగుంది అమ్మగారు మీనుంచి" అన్నాడు తలగుడ్డ విప్పుతూ డ్రయివరు బోయ్.

"అమ్మా గిమ్మా అని పిలవొద్దని ఎన్ని సార్లు చెప్పాను. ముందువెళ్లి ఆ ధారిని పోతున్నవార్ని పిలు, కొంచెం కారు కదిపి పెడతారు" అని గద్దిస్తూ టక్‌మని కారు తలుపుతీసి ప్రక్కనున్న దిండు చంకలోకి తీసికొని కార్లో కూర్చుంది లక్ష్మి. ఎదురుగా తలొంచి అయిష్టంగా వెళ్తున్న కారు కుర్రవాడ్ని చూసి మరింత చిరాకుతో రెండో ప్రక్కకు ఒత్తిగిల్తూ యిస్సు మంటూ నుదురుమీద పడిన జుత్తును చెవ్వుమీదకు లాక్కుంది. ఎదురుగా సువర్ణ రేకులతో తాపితమైన దేవాలయ గోపురము, దానిమీద నున్న గుమ్మడిపండు లాంటి కలశం లక్ష్మి కంటబడ్డాయి. ఈ సారయినా సింహాద్రి దేవుడు నా గర్భం పండిస్తాడో లేదో అని కలత చెందుతూ చెమటకు తడిచిన శరీరాన్ని తన నీలిరంగు చీర కొంగుతో తుడుచుకొంటూ గాలి కొఱకని ముందరనున్న కారు అద్దాన్ని పైకి లేవనెత్తింది లక్ష్మి. మబ్బుల్లోనుంచి బయలు వెడలుతున్న సూర్యబింబం లక్ష్మికి బారసాల నాటి స్నానం పూర్తి అయిన బాలింతరాలి ముఖంలా కనిపించింది. ఆ లేత యెండకిరణాలికి శరీరం మీద ముత్యాల్లాంటి స్వేద బిందువులు లేచాయి. వాటిని తుడుచుకుంటూ తనకున్న ఆరోగ్యం, అందం వ్యర్థం కావలసిందేనా? తన తండ్రి దగ్గరనుండి తనకు సంక్రమించనున్న హద్దులేని ఆస్తిపాస్తులకి వారసులు లేని గతి కలగవలసిందేనా? అని ఆవేదన చెంది యింత సిరిసంపద లిచ్చిన లక్ష్మీపతి

సంతానభాగ్యం మాత్రం ఎందుకు కలిగించడు! అని తన్నుతానే సముదాయించుకుంది లక్ష్మి.

2

ఆరవక్లాసు పూర్తి కాకుండానే "చదువుకొని ఉద్యోగం చేయాలా, ఊళ్లు యేలాలా" అంటూ చదువు మానిపించాడు తండ్రి కూతురు లక్ష్మిని. ఒకేఒక కూతురు కాబట్టి యితరుల యింటికి పంపించుట కిష్టపడక ఒక సామాన్య కుటుంబమునకు చెందిన వ్యక్తికిచ్చి పెండ్లిచేసి యిల్లరికం తెచ్చుకున్నాడు. ఉన్నది పెద్ద పట్టణం; పైగా కన్నవారిల్లు. అందుచే లక్ష్మికి దినాలు చాల ఉల్లాసంగా గడిచిపోతున్నాయి. కాని యీమధ్య తరచు యిరుగుపొరుగువారు, "ఎంతుంటే ఎందుకు, సంతానంలేని ఒడికి, చందమామలేని ఆకాశంకి శోభా సొంపా" అని అంటున్న మాటలు లక్ష్మికి మనస్సులో ఒక రకమయిన ఆవేదన్ని కలిగించాయి. తత్ఫలితంగా నోములూ, వ్రతాలు తీర్థయాత్రలే దైనిక కృత్యాలయాయి.

ఆదినం అందుకనే సింహాచలం ఆలయానికి స్వంతకారుమీద వచ్చింది. దైవదర్శనం, బ్రాహ్మణసేవ ముగించుకొని వచ్చేసరికి రాత్రి ఏ రెండు గంటలకో లేచాడేమో కారుబోయ్ కునుకుతున్నాడు. అది చూసి అలవాటుకి అవకాశం కలిసొచ్చింది కాబట్టి చీవాట్లు పెట్టకుండా ఉండలేకపోయింది లక్ష్మి. ఇప్పుడు పంపిన కారుబోయ్ యింకా రానందుకు మరింత మండుతూ కారులోనుంచి వెలుపలికి వచ్చి నిస్సహాయంగా సింహాచలం కొండల్లోకి చూసింది. ఇటువంటి వెధవ పరిస్థితి ప్రపంచంలో తనకొక్కరికే కాదుకదా అనుకుంది. సర్వసౌఖ్యాలకు ధనమే మూలమని తండ్రివద్ద నేర్చుకున్న మంత్రం తప్పనీ కించిత్ అనుభవం కలిగిన లక్ష్మి కండ్ల ఎదుట గత జీవితఘట్టాలు అనేకం సినిమా చిత్రముల్లా గోచరించాయి. ఇరుగుపొరుగువారు తమ పిల్లలు చేస్తున్న అల్లరులు గురించి వినిపిస్తున్నప్పుడు వెటకారంగా నవ్వేది లక్ష్మి; "పిల్లడకు నలుసుగా ఉంది బీచికి రాలేన"న్న స్నేహితురాండ్రుల సంసార తాపత్రయం చూసి వెధవ బ్రతుకు అని పెదవి విరస్తూండేది. ఎక్కడలేంది పాలడబ్బాలకే చాలకపోతూయుంటే పట్టుచీరె లెలా వస్తాయని తన ఆడబొట్టంటున్నప్పుడు 'కర్మ' అని వేదాంతం చెప్పేది. అవన్నీ యిప్పుడు తనకే చెందుతున్నట్లు నిరూపించాయి లక్ష్మికి. ఆ ధ్యానంలో మునిగి పరధ్యానంగా యుంది లక్ష్మి. అప్పుడు కారు త్రోయడానికి తీసికొని వచ్చిన గొల్లవాడి రెండు మేకపిల్లలూ కుప్పిగంతులతో వచ్చి లక్ష్మి చీరకొంగులో తల దూర్చాయి. త్రుళ్లిపడి లక్ష్మి చూసింది. రెండు 'మే' అంటూ మమకారంగా అరచాయి. ఇంతలో కారుబోయ్ గొల్లవాడు వచ్చారు. లక్ష్మి రెండు మేకపిల్లలని చిరాగ్గా చేత్తో తొలగించి ధనీమని కారు తలుపుతీసి స్టీరింగుమీద చేతులువేసి కారులో కూర్చుంది. ఆ దృశ్యం చూసి వెర్రిగొల్ల, "మీ అమ్మగారికి మా పిల్లల మీద మాచెడ్డ మక్కువ లాగుందే" అని వెటకారంగా అన్నాడు. "ఊరుకోరా

బాబు ఆవిడగార్ని అమ్మగారని పిలిస్తే మహాగొప్ప కోపం, పిల్లలంటే మరీ చిరాకు'' అని నెమ్మదిగా గొల్లకి సమాధానం యిస్తూ కారుని తోయసాగాడు. గొల్ల కారు కెదురుగా వచ్చి గెంతులేస్తున్న తన మేకపిల్లల్ని ప్రక్కకుత్రోలి లక్ష్మి వైపు బేలగా చూస్తూ కారు వెనక్కి వెళ్లాడు. గొల్ల చేయి పడ్డంతోడనే కారు కదిలింది; డ్రయివరు బోయ్ కారులో కూర్చుని, ''అమ్మగారూ...'' అని ఏదో చెప్పబోతూ పొరపాటయినట్టు నాలిక కరుచుకున్నాడు. లక్ష్మి వెంటనే వెనక్కి చూసి, ''ఏంరా అబ్బాయి'' అని అనుకోకుండానే అన్నది. ఆ మాటలు విన్న కుర్రవాడు తన చెవ్వుల్ని తానే నమ్మలేక పోయాడు. అలాగన్న లక్ష్మి తన హృదయాన్ని తానే నమ్మలేక పోతుంది. కాని కారు మాత్రం యీ యిరువురి సందేహాలకు ఆగక యింటికి చేరుకుంది.

—(o)—


## గృహలక్ష్మి

చందా వివరములు

సంవత్సరచందా - రు. 4-50

6 మాసములచందా - రు. 2-25

విడిప్రతిక 40 నయాపైసాలు

ఏజంట్లుకు 100కి రు 20 లు కమీషను ఒక ఫ్రీ కాపీ యివ్వబడును. చందాలు సేకరించి మాకు పంపువారికి రు. 100 కి 20 లు కమీషను యివ్వబడును.

మేనేజరు, గృహలక్ష్మి,

మదరాసు - 14.



జాతక ఫలములకు

పెండ్లి పొంతనాలకు

ముహూర్తములకు

సంప్రదించండి !

చాల సంవత్సరాలుగా పేరు పొందిన

పాతూరి సుబ్బరాయశాస్త్రి

147 - 11 డి బాలాజీనగర్

మద్రాను 14.



## కటకరసాయనం

బాహ్య, అంతర్గత మూలవ్యాధి చికిత్సకు దివ్యౌషధము. ఇందులో ప్రమాదకరమైనట్టియు, అలవాటుకలుగజేయు ఓషధులేవియు చేరియుండలేదు. రుచికరంగాను, సులభముగా సేవించుట కనువుగానున్నది. వివరములకు:

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్

మద్రాసు - 14.